యథేచ్ఛగా భూదందా..!

సర్కారు భూమిలో దర్జాగా నిర్మాణాలు

- అసైన్డ్ భూముల్లోనూ జోరుగా కట్టడాలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ శాఖ



కాప్రా జమ్మిగడ్డలోని స్టేడియం స్థలంలో ప్లాట్లు చేసి..

సాక్షి, మేడ్చల్ జిల్లా: చిన్నపాటి ప్రభుత్వ స్థలంలో ఎవరైనా పేదలు గుడిసె వేసుకుంటే అధికారులు హంగామా చేస్తారు. కూల్చేవరకు ఊరుకోరు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణే తమ కర్తవ్యం అంటారు. బడాబాబులు, రాజకీయ నేతల అనుచరులు గజాలు కాదు.. ఏకంగా ఎకరాల కొద్దీ ఆక్రమించేస్తున్నా.. వారికి కనిపించవు. ఒకవేళ కట్టడి చేసేందుకు ముందుకు కదిలినా నేతలు ఎక్కడికక్కడ వారిని అడ్డుకుంటారు. అప్పుడు వారు నిబంధనలు పక్కనపెట్టి.. మనకెందుకొచ్చిన సమస్య అంటూ అటువైపు వెళ్లడానికి కూడా సాహసించరు. శివారుల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిస్థితి ఇలా ఉంటే.. చెరువులు, కుంటల బఫర్ జోన్లు, శిఖం భూముల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై కూడా జిల్లా రెవెన్యూ అధికార యంత్రాంగం చూపుతున్న ఉదాసీనత వైఖరి భూకబ్జాదారులకు వరంగా మారుతోంది.

మచ్చుకు కొన్ని..

- కాప్రా మున్సిపల్ సర్కిల్ పరిధిలోని సర్వే నంబర్199/1 జమ్మిగడ్డలోని స్టేడియానికి సంబంధించిన ప్రభుత్వ భూమిని కబ్జాదారులు ఆక్రమించి, ప్లాట్లు చేసి, ఇళ్లు నిర్మించి రూ.15 నుంచి రూ.20 లక్షలకు విక్రయిస్తున్నారు.
- ఓల్డ్ మల్లాపూర్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీకి ఎదురుగా ఉన్న సర్వే నంబర్–24లోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు భూకబ్జాదారులు స్థలాన్ని చదును చేస్తున్నారు.
- కీసర గ్రామంలోని సర్వేనంబర్ 131లో 105.26 ఎకరాల ఫారెస్టు భూమి ఉండగా, ఓ భూకబ్జాదారుడు దొంగ కాగితాలను సృష్టించి.. 2 ఎకరాల స్థలంలో బండరాళ్లను పగులగొట్టి, స్థలాన్ని చదును చేసి, భవన నిర్మాణ పనులు పారంభించినా.. ఫారెస్టు, రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఈ భూకబ్జాపై మండల ఉపాధ్యక్షుడితో సహా స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.



- కీసర రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 825లో ఉన్న 7.08 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల కబ్జాలో ఉన్నా.. రెవెన్యూ శాఖకు పట్టించుకోవడం లేదు.
- బోడుప్పల్ పరిధిలోని సర్వే నంబరు 63/29లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా, 1974 నుంచి ఆక్రమణకు గురవుతోంది. అప్పట్లో బోడుప్పల్ గ్రామ పంచాయతీగా ఉండటంతో ఓ భూకబ్జాదారుడు 220 గజాల నుంచి 440 గజాల చొప్పున నకిలీ జీపీ లేఅవుట్ సృష్టించి ఒక్కో ప్లాట్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్ష ధర నిర్ణయించి విక్రయించారు. ప్రస్తుతం అదే ప్రభుత్వ స్థలాన్ని భూకబ్జాదారులు, స్థానిక రాజకీయ నాయకులు కలిసి 60 గజాల నుంచి 80 గజాలు ఉండేలా కొత్త లేఅవుట్ తయారు చేసి.. ఒక్కో ప్లాట్‌ను గజానికి రూ.10 వేల చొప్పున విక్రయిస్తున్నారు.
- బోడుప్పల్‌లో పార్కు, శ్మశానవాటికకు చెందిన 2,611 గజాల స్థలంతో పాటు అక్షయనగర్‌లో 509 గజాలు, వెంకటేశ్వర్‌నగర్‌లో 350 గజాల పార్కుల స్థలం అన్యాక్రాంతమవుతోంది.
- పీర్జాదిగూడలోని 13 కాలనీల్లో మొత్తంగా ఉన్న 3 ఎకరాల పార్కుల స్థలాలు కబ్జాదారుల గుప్పిట్లో ఉంది.
- బోడుప్పల్ పరిధిలోని చెంగిచర్ల చింతలకుంట చెరువు కట్టకు సంబంధించిన భూముల్లో అక్రమంగా బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు.
- యప్రాల్‌లో సర్వే నంబర్ 171లోని బండాయికుంటను ఆక్రమించి, ప్లాట్లు చేసి అమ్ముతున్నారు.
- దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని అహ్మద్‌గూడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 51లో రూ.10 కోట్ల విలువ చేసే రెండెకరాల రెండు గుంటల ప్రభుత్వ భూమి ఉంది. సర్వే నంబర్ 504లో 3.14 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. అహ్మద్‌గూడలో సర్వే నంబర్ 22లో పార్కు స్థలం కబ్జాకు గురైంది. దమ్మాయిగూడలోని సర్వే నంబర్లు 530లో 2 ఎకరాలు, 574లో 2.13 ఎకరాలు, బండ్లగూడలోని సర్వే నంబర్ 74లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది.
- నాగారంలోని 297 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నా.. రెవెన్యూ శాఖలో చలనం లేదు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్డుకు అనుకుని ఉన్న ఐదు ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు కబ్జాకు గురయ్యాయి.
- చీర్యాల గ్రామంలోని సర్వే నంబర్ 7, 8లలో 12.5 గుంటల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు ఆక్రమించారు. ఇదే రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 152/2లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిని ప్లాట్లు చేసి విక్రయించారు.
- కీసర మండల కేంద్రంలోని 184, 185, 188, 196 సర్వే నంబర్లలోని 22 ఎకరాల సీలింగ్ భూమిని నలుగురు వ్యక్తులు కలిసి జీపీ లేఅవుట్‌తో ప్లాట్లు చేసి విక్రయించారు.
- గాగిల్లాపూర్‌లోని 214 సర్వే నంబరులో 57 ఎకరాల అసైన్డ్ భూమిలో 40 ఎకరాలు, డి.పోచంపల్లిలో 120 సర్వే నంబరులో 152 ఎకరాల అసైన్డ్ భూమిలో 60 ఎకరాలు కబ్జా గురైనట్లు తెలుస్తోంది.
- నిజాంపేటలోని 332, 233, 334 సర్వే నంబర్లలోని 300 ఎకరాల్లో సగం భూములను కబ్జా చేసి ఇళ్లు నిర్మించుకున్నారు.
- బౌరంపేటలోని 166 సర్వే నంబరులో 449 ఎకరాల అసైన్డ్ భూముల్లోని మట్టిని తవ్వి కోట్లాది రూపాయలు స్వాహా చేస్తున్నా.. రెవెన్యూశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.
- గాజుల రామారంలోని సర్వే నంబర్లు 307, 329,79, 307లలోని 30 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా గురైనా పట్టించుకోవడం లేదు.
- కీసరలోని 181 సర్వే నంబర్‌లోని 2 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసి నిర్మాణాలు చేపడున్నా కదలికలేదు.
- శామీర్‌పేట్‌లో రియల్టర్లు తమకున్న 45 ఎకరాలకు పక్కనున్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి వెంచరు చేసినా, రెవెన్యూ అధికారుల నుంచి స్పందన లేదు.
- జవహర్‌నగర్‌లో దాదాపు 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. ఇందులో ప్రైవేట్ ఆస్పత్రితో పాటు ఇతర సంస్థల నిర్మాణాలు కూడా చేపట్టారు.



కీసరగుట్ట రోడ్డు ప్రాంతంలో ఫారెస్టు స్థలాన్ని చదును చేసి, నిర్మాణాలు చేపడుతూ..



కీసర రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమిలో సాగు

ఎమ్మెల్యేకు ఉప్పల్ వాకర్స్ అభినందన



ఉప్పల్: ఉప్పల్ భగాయత్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉప్పల్‌లో భారీ మెజార్టీతో విజయం సాధించిన బండారి లక్ష్మారెడ్డి వాకర్స్‌ను ఎంతో ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ ప్రజలందరూ ఆదరించడంతోనే భారీ మెజార్టీతో గెలుపు సాధ్యమైందని, అందర్నీ గుర్తు పెట్టుకుంటానని, ఏ అవసరం, ఆపద వచ్చినా మీ ముందు ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోగుల దయాకర్‌రెడ్డి, మేకల మధుసూదన్‌రెడ్డి, జెట్ట సుధాకర్, వాకిటి బుచ్చిరెడ్డి, అంజిరెడ్డి, వెంకన్న, భూపతి, నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా అయప్ప మహా పడిపూజ



గౌతంనగర్: డివిజన్ పరిధిలోని సాయినగర్ సాయిబాబా కల్యాణ మండపంలో బుధవారం హన్మంతరావు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సామూహిక అన్నదానం నిర్వహించారు.

శుభాకాంక్షలు



గౌతంనగర్: మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను గౌతంనగర్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు వెంకటేష్‌యాదవ్, సిరిగిరి రాజు, పీవీ సత్యనారాయణ బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆకట్టుకున్న దివ్యాంగుల ఆటల పోటీలు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న పఠాన్ ఉమర్‌ఖాన్

అల్వాల్: దివ్యాంగుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి క్రీడలు దోహదపడతాయని హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల నిర్వాహకులు పఠాన్ ఉమర్‌ఖాన్ జిల్లా వికలాంగులు, సంక్షేమాధికారి యం.కృష్ణారెడ్డి అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సావాన్ని పురస్కరించుకొని బుధవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాస్థాయి ఆటల పోటీలు రామకృష్ణాపురంలోని డాక్టర్ అంబేడ్కర్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. దాదాపు 500 మంది జూనియర్స్, సీనియర్స్ దివ్యాంగులు చురుగ్గా పాల్గొన్నారు. ఏసీడీపీఓ బి.పావని, మల్కాజిగిరి కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర ఎన్జీవోస్ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

రక్తదానం సామాజిక బాధ్యత

సంస్కృతి విద్యాసంస్థల డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి

ఘట్‌కేసర్: రక్తదానం సామాజిక బాధ్యతగా భావించి రక్తదానం చేయాలని కొండాపూర్ సంస్కృతి కళాశాల డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని కొండాపూర్ సంస్కృతి కళాశాలలో లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 200 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకువచ్చేందుకు కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించామని, అపోహలు వీడి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉదయ్‌కిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మీ, కళాశాల కార్యాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్యూటీకి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

ఘట్‌కేసర్: డ్యూటీకి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సరికి చోరీ జరిగిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ వేమననగర్‌కు చెందిన రైల్వే ఉద్యోగి జీవరత్నం(53) ఈ నెల 10న ఇంటికి తాళం వేసి సికింద్రాబాద్‌లో విధులకు వెళ్లాడు. తిరిగి బుధవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఇంటి మెయిన్ డోర్ పగులగొట్టి ఉంది. అల్మారాను పరిశీలించగా 4 గ్రాముల జత ఇయర్ రింగ్స్, 5 గ్రాముల చిన్న బంగారు గొలుసు, కొంత నగదు కనిపించ లేదు. దీంతో పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

స్నేహకు బంగారు పతకం

ఘట్‌కేసర్: చౌదరిగూడ నల్లా నర్సింహారెడ్డి బీఫార్మసీ విద్యార్థిని గుత్తికొండ స్నేహ 8.78 పాయింట్లు సాధించి జేఎన్టీయూ బంగారు పతకం సాధించింది. కళాశాల చైర్మన్ నల్లా నర్సింహారెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ నల్లా ప్రశాంత్‌రెడ్డి, డీన్ కృష్ణమోహన్ అభినందించారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

ఘట్‌కేసర్: ఎదులాబాద్ నైబర్‌వుడ్ సెంటర్ (దివ్యాంగుల పునరావాస కేంద్రం)లో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఏపీఎం తౌర్యనాయక్ మాట్లాడుతూ నైబర్‌వుడ్ కేంద్రంలో నెలలో రెండుసార్లు ఫిజియోథెరపీ చేస్తామని, ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్యారా ప్రొఫెషనల్ సురక్షిత, కవిత, సెంటర్ సిబ్బంది శంకర్, నర్సింహ, బట్టె రవి, దివ్యాంగులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన

మేడ్చల్: తడి పొడి చెత్త, హానికరమైన చెత్త సేకరణ విషయంలో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని కమిషనర్ త్రిలేశ్వర్‌రావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వావ్ వెల్ బీయింగ్ ఔట్ ఆఫ్ వేస్ట్ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి, హానికర చెత్తను మున్సిపల్ సిబ్బందికి వేర్వేరుగా ఇవ్వాలని, దీనిపై అందరికీ పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. డీఈ విజయలక్ష్మీ, ఆర్ఓ రాంచందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసేవారికి పదవులు

కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మందముల పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి పార్టీ పదవులు దక్కుతాయని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఉప్పల్ సర్కిల్ బీ బ్లాక్ పరిధిలోని అన్ని డివిజన్ల నాయకులు, కార్యకర్తలతో మల్లాపూర్ వీఎస్ఆర్ గార్డెన్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వం కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు అమలవుతున్నాయని, దీన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్, కాంగ్రెస్ నేతలు రాఘవరెడ్డి, అంజిరెడ్డి, సీతారాంరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేష్, రాజేందర్, నెమలి అనిల్ కుమార్, పత్తికుమార్, అంజయ్య, యాదగిరి, సుదర్శన్, గట్టయ్య, సద్గుణారావు, రాజేష్, సాయిగౌడ్, బాలరాజ్‌గౌడ్, రాజుగౌడ్, కిట్టు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



ఉప్పల్: రాచకొండ సీపీగా బాధ్యతలు చేపట్టిన సుధీర్ బాబును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం ఆయనను కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు పాలకుల సహకారంతోనే తాము విధులు నిర్వర్తించగలమని సుధీర్‌బాబు తెలిపారు.

కరెంట్ షాక్‌తో కార్మికుడి మృతి

అల్వాల్: కరెంట్ షాక్‌తో కార్మికుడు మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన హేర్మన్ రహాని(20) కార్మికుడు. అల్వాల్‌లోని ఎమ్ఎచ్ఆర్ కాలనీలో నూతన భవనం వద్ద ఫాల్‌సీలింగ్ పని చేస్తున్న సమయంలో డ్రిల్లింగ్ మిషన్‌కు వైర్ చుడుతుండగా కరెంట్ షాక్ తగిలి ప్రమాదానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భూకబ్జాలను అరికట్టాలి

జిల్లా అదనపు కలెక్టర్‌కు సీపీఐ జిల్లా నాయకుల వినతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కబ్జాదారులు వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని, ఈ విషయమై పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించినా.. ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని వారు అందజేశారు. నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సర్వే నంబర్లు 326, 307 పరిధిలోని దేవేందర్ నగర్, మిథిలానగర్, బాలయ్య బస్తీ, రావినారాయణరెడి నగర్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని వారు పేర్కొన్నారు. సర్వే నంబర్–12లో హరితహారం మొక్కలు నాటితే, ఆ భూమిని కూడా కబ్జా చేశారని తెలిపారు. సూరారంలోని విశ్వకర్మ కాలనీ భూములు కబ్జా గురవుతున్నాయన్నారు. జగద్గిరిగుట్ట సర్వే నంబర్ 348/1లో దేవాదాయ భూమి, రాజీవ్ గృహకల్ప భూములు కబ్జా చేయటంతోపాటు అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయన్నారు. బాచుపల్లి మండలంలోని ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను కబ్జా చేస్తున్నారన్నారు. నిజాంపేట్‌లోని మధురానగర్, అయ్యప్పస్వామి దేవాలయం వద్ద వెజిటేబుల్ మార్కెట్‌కు కేటాయించిన స్థలాన్ని కూడా కొందరు కబ్జా చేస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్ట్ కాలనీ వద్ద సర్వే నంబర్: 344, నిజాంపేట్ సర్వే నంబర్ 87లో భూములు కూడా కబ్జాకు గురవుతున్నా.. అధికారులు పట్టించుకోడం లేదన్నారు. సీఎం ప్రజాదర్బార్‌లో ఈ భూకబ్జాలపై ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా, నియోజకవర్గ నాయకులు ఉమా మహేష్, శ్రీనివాస్, హరినాథరావు, సదానందం, శ్రీనివాస్, మహేష్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి చేపడతామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో రూ.17 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాశ్వత పరిష్కారం దిశగా డ్రైనేజీ పనులు చేపడుతున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు బోదాసు లక్ష్మీనారాయణ, కటార్ల భాస్కర్, రంగు మల్లికార్జున్‌గౌడ్, వంగేటి సంజీవరెడ్డి, బుసాని రఘు, నాగేందర్, ప్రవీణ్, సంపత్, పవన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను వేగవంతం చేయండి



కేటీఆర్‌ను కలిసిన కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ బుధవారం ఉప్పల్ సర్కిల్ ఈఈ నాగేందర్‌ను కలిసి కోరారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల కోడ్‌తో జాప్యమైన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ రాజ్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, పల్లె నర్సింగరావు, ఎద్దుల కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ త్వరగా కోలుకోవాలి

చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ యోగక్షేమాలు తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని నిత్యం పూజలు చేస్తున్నట్లు వివరించారు. యాదాద్రి లక్ష్మీనర్సింహ స్వామి ఆశీస్సులతో త్వరగా కోలుకుని తిరిగి ప్రజలతో మమేకం కావాలని వారు ఆకాంక్షించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉండాలని, వారి యోగ క్షేమాలను దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని కేటీఆర్ సూచించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

వాడీవేడిగా సమీక్ష సమావేశం



అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

- అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం
- సమావేశానికి రానివారిపై గరంగరం
- ప్రశ్నలకు సమాధానాలు చెప్పని అధికారులు
- వచ్చేసారి వివరాలతో రావాలని సూచన

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశం వాడీ వేడిగా సాగింది. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు, సిబ్బంది తెల్లమొఖం వేశారు. బీజేపీ కార్పొరేటర్లు శ్రవణ్‌కుమార్, రాజ్యలక్ష్మి, సునీత యాదవ్‌లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ప్రోటోకాల్ పాటించలేదని, ఇకముందైనా పాటించేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు.

- ట్రేడ్ లైసెన్స్ ఫీజు ఏ విధంగా వసూలు చేస్తున్నారు. ఎన్ని ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయని ప్రశ్నించారు. తగిన సమాచారం ఇవ్వకపోవడంతో పూర్తి వివరాలతో రిపోర్టు తయారు చేయాలని ఆదేశించారు.
- డ్వాక్రా గ్రూప్ మహిళలకు సమావేశం నిర్వహించేందుకు తగిన భవనాలు లేవని, ప్రతి డివిజన్‌కు భవనం ఉండేలా చూడాలన్నారు. స్ట్రీట్ వెండర్స్ వ్యాపారం చేసుకునేందుకు రెడ్ జోన్, గ్రీన్‌జోన్‌లలో జోన్ ఏర్పాటు చేశారా అని యూజీడీ అధికారులను ప్రశ్నించారు.
- ఇంజినీరింగ్ విభాగంలో పనితీరు బాగాలేదని, పనులు ఆలస్యం కావడానికి గల కారణాలపై ప్రశ్నించారు.
- హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో ఎన్ని పార్కులను అభివృద్ధి చేశారు. వాటి ప్రణాళికలు ఎంత ఖర్చు చేశారు. వివరాలు తెలియజేయాలని సూచించారు. బీజేపీ కార్పొరేటర్ సునీత యాదవ్ మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి పార్కుల అభివృద్ధి గురించి వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని ఎమ్మెల్యేకు తెలిపారు.
- పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయని వాటిపై ఏంచర్యలు తీసుకుంటున్నారని టౌన్ ప్లానింగ్ అధికారులను ప్రశ్నించారు. అనంతరం వారికిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ఎంటమాలజీ విభాగం పనితీరు మెరుగుపడాలని, ఇబ్బందులు ఉంటే చెప్పాలన్నారు. మంజూరైన బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలన్నారు. తర్వాత జరిగే సమీక్ష సమావేశానికి అన్ని విభాగాల నుంచి పూర్తి వివరాలతో రావాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మీనా రెడ్డి, రాజ్యలక్ష్మీ, గున్నాల సునీత యాదవ్, శ్రవణ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ రాజు, టౌన్ ప్లానింగ్ సీపీ ప్రదీప్ కుమార్, ఈఈ లక్ష్మణ్, జలమండలి జీఎం సునీల్‌కుమార్, వైద్యాధికారి కవిత, ఏఎంహెచ్‌వో వెంకటరమణ, ప్రాజెక్టు అధికారి మల్లికార్జున్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.